# భగ్న ప్రేమికులు!

రచన: శ్రీ కవుల ఆంజనేయ శర్మ,
శ్రీ జి. యస్. కె. సాయిబాబా.

'ఎలా వుందండీ?' ప్రశ్నిస్తూ డాక్టర్ సురేష్ లోనికి వచ్చాడు.

'ఏం చెప్పను డాక్టరు బాబూ, ఉదయంనుండి అపస్మారకంలోనే వుంది' కన్నీళ్లు అత్తుకుంటూ అన్నారు రత్నమ్మగారు.

'మీరేం గాభరా పడకండమ్మా, తగ్గుతుంది. ఉదయం ఇంజక్షన్ యిచ్చానుగా! ఇప్పుడొకటి యిస్తాను,' అన్నాడు డాక్టర్ సురేష్.

'మీరే రక్షించాలి డాక్టరుగారూ! ఒక్కగానొక్క కూతురు. గుండెల్లో నొప్పి అని కొన్నాళ్లు మందులు వాడింది. కాని పని చెయ్యలేదు. విషమించి మంచాన పడింది. మా ప్రాణాలన్నీ అదే! అదేగాని లేకపోతే మేం జీవించలేం డాక్టరుగారూ!' అశ్రుశిత నయనాలతో బాధగా అన్నారు రత్నమ్మగారు.

'అమ్మా, భయంలేదు. మీ అమ్మాయిని రక్షించే బాధ్యత నాది. మీరేం బాధపడకండి!' - అంటూ మంచంపై అపస్మారకంలోవున్న నాగమణి చెయ్యి పుచ్చుకొని చూచాడు డాక్టర్ సురేష్. ముఖంలో ఏవో భావాలు లీలగా ప్రత్యక్షమై కంగారుపడ్డాడు. వెంటనే ధైర్యం పుంజుకొని మనిషిని పరిశీలించి చూచాడు. కళ్లు మూసుకుంది నాగమణి. శరీరమంతా నీరెక్కివుంది; మనిషి లావయిపోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఆమె వక్షం ఎగిరెగిరి పడ్తోంది. శరీరం చల్లగా వుంది.

'డాక్టరు బాబూ, ఫరవాలేదుకదా' ఆతృతగా అడిగారు రత్నమ్మగారు,

మనసులో ఒక భావం ఉన్నప్పటికి, దాన్ని బైటి వెలిగ్రక్కక, చెబితే కంగారుపడిపోతారని, ఆ భావాన్ని తనలోనే అణచుకొని 'ఫరవాలేదమ్మా' అన్నాడు డాక్టర్ సురేష్. 'అమ్మా, ఈ జబ్బేంటో తెలియటంలేదు. మొన్న చేసిన ఇంజక్షన్లకు కాస్త తగ్గుముఖం పట్టింది, మళ్లా వెంటనే తిరగేసింది. నాదగ్గరున్న మందులు ఆమెకు పనిచేయవు తల్లీ! నన్ను క్షమించి మరో డాక్టర్ని చూడడం ఎంతైనా అవసరం' - అన్నాడు డాక్టర్ సురేష్ తల దించుకొని.

'మందు లేకపోతే మీరేంచేస్తారు డాక్టరు బాబూ! మిమ్మల్ని క్షమించటంలోగల తప్పేమిటి? మీ శాయశక్తులా మీరు ప్రయత్నించారు. మీ తప్పేంలేదు డాక్టరు బాబూ!'-అన్నారు రత్నమ్మగారు సురేష్‌లో గోప్యంగా యిమిడిఉన్న భావాన్ని అర్థంచేసుకోలేక.

'వస్తానమ్మా!' అంటూ నిశ్శబ్దంగా నిష్క్రమించాడు డాక్టర్ సురేష్.

విపరీతమైన దుఃఖంతో వెళ్ళి పూజామందిరంలో వెంకటేశ్వరస్వామి పాదాలముందు వాలిపోయారు రత్నమగారు.

'స్వామీ! ఏమిటీ విపరీతం? భరించలేను. ప్రాణాలు కన్న మిన్నగా చూచేదానికే రావాలా యీ మాయదారి జబ్బు. ఏం పాపంచేశాం స్వామీ, ఈ శిక్ష? మాయందు అపరాధముంటే మమ్మల్ని శిక్షించు స్వామీ! ఆ శిక్షకు పరిహారంగా నీ ఏడుకొండలు ఎక్కి నీ పాదాలముందు పడతాము. నీ భక్తులను నీవు రక్షించు స్వామీ! ఈ జబ్బు తగ్గితే నీ కొండకు తీసుకువచ్చి తలనీలాలు యిప్పిస్తా ప్రభూ! నీ ఉండీలో 116 రూ॥లు రొక్కం వేయిస్తా నా తల్లిని కాపాడు తండ్రీ! లేక లేక కలిగిన బిడ్డ. ఎన్నో వ్రతాలు, నోములు, పూజలువల్ల కలిగిన బిడ్డ. దాన్ని చూచే జీవిస్తున్నాయి యీ ప్రాణాలు. దాని సుఖమే మా సుఖం. మమ్మల్నుండి దాన్ని వేరుచేయకు స్వామీ!'-అంటూ దీనంగా వేడుకున్నారు రత్నమ్మగారు.

'రత్నం'-అన్న పిలుపుకు కళ్లు గభాలున తుడుచుకొని లేచి నించున్నారు.

'రత్నం, నీ కెన్నిసార్లు చెప్పాను, అలా ఏడవకూడదని? పిచ్చిదానా, అమ్మాయికేం ఫరవాలేదు. గాభరా పడకు. మన కుల దైవం ఆ స్వామి వుండగా మనకేం భయంలేదు. త్వరలోనే తగ్గిపోతుంది'-అంటూ తల నిమిరారు భర్త ప్రకాశరావుగారు,

ఆ వూర్లో ప్రకాశరావుగారు పేరుపొందిన లాయరు. తాత ముత్తాతలనాటినుండి వస్తున్న లాయరు వృత్తినే ఆయనాకాంక్షించి ప్రాక్టీసు ప్రారంభించారు. దైవం అనుకూలించడంతోనే పేరు ప్రఖ్యాతులతోపాటు ధనం కూడా విపరీతంగా గడించారు. ఆయన పలుకుబడి తక్కువ కాలంలోనే అందరినీ ఆకర్షించింది. ప్రకాశరావుగారి భార్య రత్నమ్మగారు చక్కని ఇల్లాలు. భర్తకు అనుగుణంగా నడిచే ఇల్లాలు. ఎప్పుడు భర్త మాటకు ఎదురు చెప్పదు. ఎవరినైనా స్వంత బంధువుల్లా ఆహ్వానించి, అతిథి మర్యాదలుచేసి వాళ్ళను తృప్తిపరచటం చిన్నప్పటినుండి ఆమెకు ఉగ్గుపాలతో నేర్పిన విద్య. ఎవరినైనా ఆదరంగా పలుకరించి, కష్ట సుఖాలు తెలుసుకొని, కాస్తో కూస్తో సహాయంచేసి, దేవత అనిపించుకొనే మహా ఇల్లాలు. తనింటి గుమ్మంముందు ఎవరైనా నిలబడి 'అమ్మా!' అని నోరెత్తి అడిగితేచాలు వాళ్ళకు కడుపునిండా భోజనంపెట్టి పంపిస్తుంది లేదనకుండా. ఎవరైనా 'ఏమిటమ్మా! అలా వాళ్ళకి అలవాటు చేస్తే వారితో వేగలేంకదా! అలాంటప్పుడు వార్ని అలవాటు చేసుకోవడం దేనికని' అడిగితే - చిరునవ్వుతో 'వాళ్లు నోరెత్తి అడిగితే లేదనటానికి నా నోరు రాదమ్మా! ఏదో భగవంతుడు మనకు ప్రసాదించినదాంట్లో కాస్తో కూస్తో ఖర్చుచేసినంతమాత్రమున మన ఐశ్వర్యం తరిగిపోదుగా. మనవెంట వచ్చేవి పాప పుణ్యాలు తప్ప ఈ సంపదలన్నీ రావని తెలీదూ? తెలుసుండీ అజ్ఞానంలో పడతారీ విజ్ఞానపు మానవులు'_అంటారు. ఆమె తత్వం అది. కొన్ని సంవత్సరాలవరకు సంతానం కలుగలేదా దంపతులకు. ఎన్నో దేముళ్ళకు మ్రొక్కుకొని, వ్రతాలు, పూజలు, నోములు ఆచరించి చివరకు విజయం సాధించారు. ఫలితంగా ఎ.తో శరీర మెరుపుతోబాటు అందచందాలు చిందిస్తూ జన్మించింది నాగమణి. చినప్పటినుండి ఎంతో గారాభంగా, ముద్దుగా పెరిగింది. ఆమె కోర్కె కోరిందంటే అది తీర్చుకొనేవరకు పట్టు వదలని దిట్ట. నాగమణి అంటే తల్లిదండ్రులకు ఎనలేని ప్రేమ. ఆమె ఒక్క క్లాసయినా ఫెయిలవకుండా యస్. యస్. యల్. సి. ప్యాసయింది. ఫస్టు మార్కులతో, ఫస్టు ఫారంనుండి ఆమె స్నేహితుడు రాజా ఫస్టుక్లాసులో వస్తూండేవాడు. ఇద్దరకు తగని స్నేహం. విడని బంధం. ఒకానొక సంఘటనవల్ల యిరువురు మనసులు యిచ్చిపుచ్చుకున్నారు. పి. యు. సి. లో యిద్దరూ చేరారు. యూనివర్సిటీ ఫస్టు తామే పొందాలని పెద్ద ఆశతో రాత్రిం బవళ్లు కష్టపడి చదివి పేపర్లన్నీ రాశారు. ఇద్దరూ యూనివర్సిటీకి ఫస్టు తమదేనని గర్వించారు. వేసవి శలవులకు నాగమణిని వదల్లేక వదల్లేక రాజా విశాఖపట్నం విడిచి కాకినాడ చేరుకున్నాడు. అతని వియోగాన్ని భరించలేకపోయింది నాగమణి. తత్ఫలితంగా ఈ జబ్బు ఆమెను ఆహ్వానించింది. తల్లిదండ్రులు తమ అమ్మాయికి చిన్నప్పటినుండి జబ్బు రావటమనేది ఎరుగదు. అలాంటిది ఇది వచ్చేసరికి భరించలేకపోతున్నారు. ఎంతైనా కన్న తల్లిదండ్రులు. కడుపుతీపి వాళ్ళనలా కంగారుపెడుతోంది. కంటికి నిద్రెలా వస్తుంది? కడుపునిండా తిండెలా తింటారు? అదిరే గుండెలతో బెదిరే మనుషులు.

నాగమణి మెల్లగా కళ్లు తెరచి నీరసంగా చూచింది. రత్నమ్మగారు మందు గ్లాసులో పోసి మెల్లగా పట్టారు. బరువుగా గుటకలు వేసింది నీరసంతో నాగుమణి. కొంత సేపటికి మెల్లగా నోరు పెకల్చుకొని 'అమ్మా! ఎందుకింకా తాపత్రయపడతారు. ఇంకెన్ని మదులు వాడినా ఈ జబ్బు తగ్గదు సరికదా, ఈ రోజుతో నేను విశ్రాంతి పూర్తిగా తీసుకుంటాను' అంది నాగమణి.

'ఏమిటండీ, యిలా అంటుంది?' భయంగా భర్తను అడిగారు రత్నమ్మగారు.

'అమ్మా! నీకేం భయంలేదు. ఈ జబ్బు తగ్గి కులాసాగా తిరుగుతావు. అలాంటి మాటలేం అనకు తల్లీ! నిన్ను విడిచి జీవించగలమా? డాక్టరు రాజారావుగార్ని తీసుకువస్తా. ఆయన ప్రఖ్యాతి గాంచారు. సురేష్‌బాబు వూరికి వెళ్లారు తల్లీ! రాజారావుగారివల్ల నీకు తప్పక నయమవుతుంది. పడుకో తల్లీ'_అన్నారు అబద్ధమాడుతూ.

'హుఁ! డాక్టర్లు! ఎందుకు నాన్నా? మీ పిచ్చిగాని, ఏవో రోగాలను మాన్పటానికి, ఫీజు పుచ్చుకోవటానికే తప్ప, పోతున్న ప్రాణాలు తిరిగి పొయ్యగలరా? రోగి చనిపోతాడని తెలుసున్నప్పటికి పైకి చెబుతారా? నా ముఖంగా మీ సంతృప్తికొరకేవో వాలుగు మందులు

వాడుతారు. ఇన్ని జరిగినా రోగి మరణించక మానడు'- అంది నీరసంగా.

'తప్పు తల్లీ! అలా అనకు. డాక్టర్లు తమ రోగిని బ్రతికించాలి, తమ ఖ్యాతి పెరగాలి అని చూస్తారేతప్ప చనిపోవాలని కోరుకోరు పిచ్చి తల్లీ - అన్నారు ప్రకాశరావు గారు.

'కోరుకుంటారని కాదు నాన్నగారూ! వారికి రోగి మరణిస్తాడని తెలుసున్నప్పటికి బైటకది వెలువరించక మభ్యపెడతారు అమాయకులైన మిమ్మల్ని, అలా మభ్యపెట్టక ఉన్నది ఉన్నట్లు చెప్పరుకదా అని నేను అనేది' అంది నాగమణి.

'మణీ! నీరసంతో వున్నావు. మాట్లాడకు తల్లీ! నీరసం జాస్తి అవుతుంది'-అన్నారు రత్నమ్మగారు.

'మా అమ్మకు నేనంటే ఎంత ప్రేమ' అంది నాగమణి.

'నీవేనమ్మా మా ప్రాణాలు! నీవు లేందే జీవించలేం'- బాధగా అన్నారు.

'రత్నం, అమ్మాయిదగ్గర కూర్చో! ఇప్పుడే పోయి డాక్టరు రాజారావుగారిని తీసుకువస్తా!' అంటూ చెప్పు వేసుకుని బయలుదేరారు ప్రకాశరావుగారు.

'అమ్మా! నాముఖం చూచి నిజం చెప్పమ్మా! నేను బ్రతకను కదూ?'-అంది నాగమణి.

'తప్పు తల్లీ! అలా అనకు నీవు లేకపోతే మేము జీవించలేం తల్లీ! మేం జీవించలేం!' - అంటూ దుఃఖించసాగారు.

'ఏడవకమ్మా!' అంటూ నింపాదిగా చెయ్యెత్తి కన్నీళ్ళు తుడిచింది. రత్నమ్మగారికి తెలియని ఆరాటం భయం ఏవో మనస్సులో విపరీతంగా కలుగసాగాయి అది ఎంత అణచుకుందామన్నా అణచుకోలేక పోతున్నారు. కంపిస్తోంది. హృదయం అదురుతోంది. మనస్సు కలతగావుంది. ఏమిటో అర్థం కావటం లేదు. లేచి మెల్లగా దీపాలన్నీ వెలిగించారు. వెంకటేశ్వరస్వామి ముందు దీపారాధన చేసారు. ప్రతిదేవతకి నమస్కారం చేసి అమ్మాయికి తగ్గిపోతే అభిషేకాలు చేయిస్తానని

Grams: "SHIVAJITEX" Phone: 23616




**T. MARIMUTHU**
HANDLOOM WEAVING FACTORY
SELLUR : : MADURAI-2.

టి. మారిముత్తు
హేండ్‌లూమ్ వీవింగ్ ఫాక్టరి.
సెల్లూరు : : మధురై-2

తలుచుకున్నారు. వంటమనిషికి పురమాయించవలసిన వన్నీ పురమాయించివచ్చి, మణివద్ద కూర్చున్నారు.

'అమ్మా! నేనొకమాట చెబుతాను చేస్తావుకదూ!, అంది ఆయాసపడుతూ.

'ఏమిటమ్మా, అది? ఒక్కటికాదు, ఎన్నైనా చెప్పు, తప్పక చేస్తాను.'

'చేతిలో చెయ్యి వెయ్యమ్మా!'_అంది.

'నామీద అంత నమ్మకం లేదా పిచ్చితల్లీ!'_అంటూ చేతిలో చెయ్యి వేసారు.

'అమ్మా!' నేను చెప్పవలసిందొకటే నమ్మా! నేను చచ్చిపోగానే నాకోసం దుఃఖించకండమ్మా! నా మనస్సుకు శాంతి వుండదు. నా జీవికి స్వేచ్ఛవుండదమ్మా! నన్ను మరచిపోయి, నీకు కూతురు పుట్టలేదనుకో అమ్మా!' అంది నాగమణి బరువుగా.

'అయ్యో, భగవంతుడా! ఎందుకయ్యా నన్నిలా శిక్షిస్తావ్? నేనేం పాపం చేసానని?...నీవు నన్ను అన్యాయం చేసిపోతావా తల్లీ? నే నీకడుపు శోకం భరించలేనమ్మా? నేనూ నీ వెంటేవస్తాను తల్లీ!' _ అన్నారు ఏడుస్తూ.

అంత మాటనకమ్మా! మీరు పదికాలాలపాటు జీవించి నలుగురికి ఉన్నతమార్గం చూపించాలి. నా సంగతా? నే నెలాగూ క్షీణించాను. నాకిక మరణం తథ్యం! విచారించకమ్మా!' అంది నాగమణి కన్నీరు కారుస్తూ.

'అయ్యో!' అంటూ దుఃఖాన్ని భరించలేక వెంకటరమణమూర్తి పాదాలముందు వెళ్లి వాలిపోయారు రత్నమ్మగారు; స్పృహ తప్పిపోయారు.

కొంతసేపటికి డాక్టరు రాజారావుగారితో సహా వచ్చారు ప్రకాశరావుగారు. రాజారావుగారు అమ్మాయిని పరీక్షించి చూచి పెదవి విరిచారు సంచి నుండి సిరెంజితీసి ఇంజక్షనొకటి యిచ్చారు. బైటకువచ్చి 'రాత్రిగడిస్తే ఫరవాలేదు. జబ్బు ముదిరిపోయింది. ఎక్కువగా మాట్లాడ నివ్వకండి, మాట్లాడటం చాలా ప్రమాదం, అమ్మాయి మాట్లాడుతూనే ప్రాణం విడుస్తుంది. ఎక్కువ నీరు పట్టేసింది. ఇంక లాభంలేదు' అన్నారు.

డాక్టర్!' నా ప్రాణాలనయినా యిస్తాను కావాలంటే, నా తల్లిని ఎలాగైనా బ్రతికించండి. ఒక్కగా నొక్కబిడ్డ, మా పంచప్రాణాలు ఆ చిట్టితల్లే, ఆమె జీవిచకపోతే మేం జీవించలేం డాక్టర్.' _ కన్నీరు కారుస్తూ దీనంగా వేడుకున్నారు.

'ప్రకాశరావుగారూ! మీరన్నది నిజమే. కాని డాక్టర్ల చెయ్యిదాటిపోయింది పరిస్థితి. ఆమెను బ్రతికించటం మా శక్యంగాదు. ఇలాంటి చిత్రమైన జబ్బు నాలైఫ్‌లో ఇంతవరకు చూడలేదు. ఈ జబ్బేమిటో అర్థం గావటంలేదు. ఈరాత్రి గడిచిందంటే మీ అంత అదృష్టవంతులు ఎక్కడా వుండరు. వస్తాను'_అంటూ కదలబోయారు.

'డాక్టర్ ఒక్కమనవి!'

ఎల్లప్పుడూ...

ప్రసిద్ధిచెందిన మా

ప్రభాత్ బనియన్లు

కొని ధరించి ఆనందించండి.



తయారించువారు

**PRABHAT HOSIERY**

3/27, Kangeyam Road : : TIRUPUR-4.

'ఏమిటండీ?'_వెను దిరుగుతూ ప్రశ్నించారు రాజారావుగారు.

'నాయందు దయవుంచి ఈ రాత్రికి మీ రిక్కడే వుండిపోండి'_అన్నారు. ఆయనమాట కాదనలేక 'సరే' అన్నారు రాజారావుగారు.

♦ ♦ ♦ ♦

అప్పటికి రాత్రికి ఎనిమిదిగంట లైంది. ప్రకాశరావుగారు పూజామందిరంలోకి ప్రవేశించారు. భార్యను స్పృహనుండి మేల్కొలిపి, లోపలకు తీసుకువెళ్ళారు. ముగ్గురు ఎంగిలిపడ్డారు. వడ్డించిన పదార్థాలన్నీ వడ్డించినట్లే ఆకుల్లో వుండిపోయాయి. నామ మాత్రంగా ఎంగిలిపడ్డారు. అందరి మనసులు కలతబారిపోయి ఏ క్షణాన్నయినా దుఃఖం వెల్లుబికిరావటానికి సిద్ధంగా వుంది. ముగ్గురు నాగమణి గదిలో కూర్చున్నారు. మణి అందర్నీ చూసింది.

'నాన్నగారూ! ఎవరో యిద్దరు మనుష్యులు నల్లగా తలపై కొమ్ములతో వున్నారు. కళ్లు భయంకరంగా వున్నాయి. చేతులూపుతూ నన్ను రమ్మని పిలుస్తున్నారు' అంది నాగమణి.

ముగ్గురకూ అర్థమయిపోయింది. తల్లిముఖం చాటుచేసుకొని కుమిలిపోతోంది. తండ్రిమాత్రం 'లేదు తల్లీ! ఎవరూ లేరు, మాట్లాడకపడుకో'_అన్నారు.

'నాన్నా! ఈ శరీరం కుళ్ళి పాడైపోయింది. ఈ దేహంపోయి ఆ స్థానే క్రొత్తదేహం వస్తుంది, మంచి దేహంవస్తుంది'_అంది నాగమణి.

'తప్పమ్మా అలా అనకు, నీజబ్బు ప్రొద్దుటికి తగ్గుతుంది' అన్నారు.

అమ్మా! ఈ పాత తలగడతీసి, క్రొత్త తలగడ వెయ్యి. ఇది పనికిరాదు, వాసనేస్తోంది'_అంది.

'అలాగేనమ్మా' అంటూ లోనికి వెళ్ళి క్రొత్త తలగడ తెచ్చారు. తల నెమ్మదిగా ఎత్తి పాతదితీసి, క్రొత్తదివేసారు రత్నమ్మగారు.

నాన్నా! ఇప్పుడు చూడు, పాత తలగడపోయి క్రొత్త తలగడ ఎలావచ్చిందో? అలాగే ఈ దేహంపోయి క్రొత్తది వస్తుంది'_అంది.

ఆమె అజ్ఞానంగా ఎప్పుడూ మాట్లాడలేదు. ఇప్పుడు మాట్లాడేసరికి ఆశ్చర్యపోయారు. కంపించారు. భయం అవహించింది. ఆమెను అందులోనుండి మళ్ళించాలని ప్రకాశరావుగారు జేబునుండి అప్పుడే వచ్చిన కవరొకటి తీసి 'అమ్మా! రాజాదగ్గరనుండి నీకో కవరువచ్చిందమ్మా! ఇదిగో'_అన్నారు.

'ఆఁ! రాజానుండి వచ్చిందా? అయితే వస్తాడన్న మాట! ఎంత సంతోషకర వార్త! ఏదీ యిలా యివ్వండి నాన్నా' అంది సంతోషంగా కవరు పుచ్చుకుంటూ.

ఆమెకంత సంతోషం ఎలా వచ్చిందో ఎవరికీ అర్థం కాలేదు. కవరులోనుండి నాలుగు మడతల కాగితం బయటికి తీసింది. విప్పి యిలా చదువుకుంది మనస్సులో.

'ప్రియమైన మణీ, హృదయరాణీ, మనసిచ్చిన పువ్వుబోణీ, సుభాషిణీ, మధురభాషిణీ, ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావీ సమయంలో? నేను ఇక్కడికి వచ్చినప్పటినుండి ఏం తోచటంలేదు. మనసు నీపైనే వున్నది. మమత

(తరువాయి 45వ పేజీలో)

అందానికి, మన్నికకు—
ఉషా బనియన్లనే వాడండి!



(39వ పేజీ తరువాయి)

చేరి నన్నంటి పెట్టుకొనుంది. కనులు తెరచినా, మూసినా నీ అందాల చిరునవ్వుల మేమే ప్రత్యక్షమవుతోంది. ఏపనీ చేయలేకపోతున్నాను. ఇక్కడున్నది మాత్రం కట్టె, నిర్జీవప్రాణి, నీపాల భాగముపై అల్లాడే ముంగురులు, నామనస్సును అల్లకల్లోలంచేస్తున్నాయి. నీచక్రాల్లాంటి కళ్ళు, వాటిలో ఏ శక్తివుందో కాని నన్ను ఆకట్టివేస్తున్నాయి. నీ ఆపిల్ వంటి నునుబుగ్గలు, వేగులాబిరంగులో మిసమిసలాడుదూ నానోరు వూరిస్తున్నాయి. పెదాలు మెరస్తూ నన్ను రమ్మని పిలుస్తున్నాయి. వీణ మీటితే వచ్చేశబ్ధంలాంటి నీకంఠస్వరం నన్నెంతో పులకరింపచేసి, మత్తెక్కిస్తోంది. నాకళ్లు నిన్ను వెదుకుతున్నాయి. హృదయం అడుగుతోంది. మనస్సు ఆలోచిస్తోంది. నీ వుత్తరం అందుకోవటం కోసం చూస్తున్నది చెయ్యి. చెయ్యి చెయ్యి కలుపుకొని షికారు చేద్దామని ఆరాటపడుతున్నాయి కాళ్ళు. ఇంక నేను ఆగలేను మణీ! నిన్ను తప్పక చూడాలి. చూచి నెలదాటింది. నేను ఈ రోజునే బయలుదేరి వస్తున్నాను. ఎదురు చూస్తుంటావనుకుంటున్నా......

ఇట్లు.
'నీ రాజా'

'హుఁ! పిచ్చిరాజా! నాకిలావుందని తెలిస్తే ఎంత కంగారుపడ్తావో?' నిట్టూర్చింది.

'అమ్మా, నీకిలా వుందని రాయలేదా?' - అన్నారు ప్రకాశరావుగారు.

'లేదు నాన్నగారూ! గాభరాపడతారని రాయలేదు'_ అంది నాగమణి ఎటో చూస్తూ.

'ఎంతపని చేశావమ్మా!'_అన్నారు ప్రకాశరావుగారు.

'ఏం నాన్నా!' ప్రశ్నించింది.

'తనకి తెలుపలేదని ఎంత బాధపడిపోతాడో' అన్నారు బాధగా.

'ఫరవాలేదు నాన్నా, నేను చెబుతానుగా!' అంది నాగమణి.

'ప్రకాశరావుగారూ!' పిలిచారు డాక్టరుగారు.

'ఆఁ!' అంటూ వెనుదిరిగి, ఆయన చేసిన సంజ్ఞ అర్థం చేసుకొని, 'అమ్మా, రాత్రవుతోంది, పడుకోమ్మా' అన్నారు.

అందులోని అర్థంగ్రహించినట్లు 'నేను మాట్లాడకూడదా నాన్నగారూ?' అంది నాగమణి తండ్రివైపు చూస్తూ.

'అబ్బే, మాట్లాడకూడదని కాదమ్మా! నీరసం ఎక్కువవుతుందని తల్లీ! నిద్రపో' - అన్నారు దుప్పటి సరిచేస్తూ.

మంచానికి అంటి పెట్టుకుపోయిన వున్న ఆమె దేహాన్ని చూడ్డంతోనే కళ్ళు చెమర్చాయి.

'ఏడుస్తున్నారా నాన్నగారూ!' అంది తండ్రిని చూస్తూ.

'లేదమ్మా! కళ్ళల్లో నలకపడితేనూ!' తప్పించుకో జూచారు.

'హుఁ! ఎందుకు నాన్నా అబద్ధమాడతావ్? మన ఇల్లు తాటాకుది కాదే నలకపడ్డానికి? నా దేహాన్ని చూచి దుఃఖిస్తున్నావు కదూ! అవును మరి. ఇది పాడయిన యంత్రం, బాగుపడాలంటే చాలాకష్టం. నాకు క్రొత్త దేహం వస్తుంది నాన్నా' - అంటూ ఆయాస పడ సాగింది.

'అమ్మా! ఎక్కువగా మాట్లాడకు తల్లీ!' - అన్నారు గుండెలపై రాస్తూ.

'చచ్చిపోతాననా? అది ఎలాగూ తప్పదు నాన్నా! ఈ తుచ్ఛశరీరంతో జీవించలేను. నాకు విముక్తి త్వరగా లభిస్తుంది నాన్నా, త్వరగా లభిస్తుంది'_అంటూ విపరీతంగా ఆయాసపడసాగింది.

'నీకెన్నిసార్లు చెప్పానమ్మా! ఎక్కువగా మాట్లాడవద్దని? మందలించారు ప్రకాశరావుగారు.

'మందలిస్తున్నారా నాన్నా! మందలించండి! ఈ ఒక్కరోజేగా మందలించేది? రేపట్నుంచి ఎవర్ని మందలిస్తారు కనుక, ఈ రాత్రితో నా జీవితం సమాప్తం, ఉదయమే ఈ శరీరాన్నే కాల్చేస్తారు. ఇంక ఇది పని చెయ్యదు. నా కోసం దుఃఖించకండి, నా జీవితానికి శాంతి వుండదు' అంటూ ఆయాసంతో కళ్ళు మూసుకుంది.

'అమ్మా, నువ్విలా మాట్లాడకూడదు. నీ జబ్బు తగ్గిపోతుంది. ఇంజక్షనిచ్చానుగా! ఫరవాలేదు.' అన్నారు డాక్టరు రాజారావుగారు.

'డాక్టర్! ఎందుకిలా అబద్ధమాడతారు? నన్ను మోసం చెయ్యలేరు. నా చావు నాకు తెలియదంటారా?' సూటిగా ప్రశ్నిస్తూ రాజారావుగారి కళ్ళల్లోకి చూసింది.

ఆ చూపులను భరించలేక తలను క్రిందకు దించుకున్నారు. నాగమణి ఆయాసంతో కళ్లు మూసుకుంది. కొంతసేపటికి హాయిగా నిదురపోసాగింది.

ముగ్గురూ మేల్కొనే వున్నారు. క్షణాలు నిముషాలై, నిముషాలు గంటలై కాలచక్రంలో కలసిపోతు

న్నాయి. గడియారం ఒకో గంట అధిగమిస్తూ 'ఠంగు ఠంగు' మని కొడుతూంటే గుండెలపై ఎవరో కొడుతున్నట్లు బాధపడసాగారు ప్రకాశరావుగారు. మొహంలో బాధ క్షణ క్షణానికి ఎక్కువవుతూ, కుర్చీలో ఆయన్ని సరిగా కూర్చుండ నివ్వటంలేదు. గంట గంటకు నాగమణిని మెల్లగా మేల్కొలిపి మందు పట్టిస్తున్నారు రత్నమ్మగారు అశ్రుశిత నయనాలతో. డాక్టర్ రాజారావుగారు మాత్రం కుర్చీలో కూర్చొని నిద్రకు ఆగలేకపోతున్నారు. నిశ్శబ్దంగా రాత్రి గడిచిపోతోంది. ఎక్కడో కుక్క విపరీతంగా ఏడుస్తోంది. అరరాత్రి పన్నెండు గంటల సమయం. అంతవరకు ఆకాశంలో విచ్చలవిడిగా తిరుగుతున్న చిన్న మేఘ మాలికలన్నీ కలసి పెద్ద మబ్బుగా ఏర్పడి, శశాంకుణ్ణి చుక్కల్ని మూసివేశాయి. తెల్లగా రూపొందుతున్న మేఘం, కారునలుపుదాల్చి పెద్ద మబ్బై ఆకాశాన్ని కప్పివేసి ఏ క్షణాన్నయినా వర్షం కురవటానికి సిద్ధంగా వుంది. చిన్న ఈదురుగాలి ప్రారంభమై మహోధృతంగా వీచసాగింది. నేలపై ఉన్న దుమ్ము, ధూళి అంతా ఏకమై నింగి కెగిసింది. ధూళి సుళ్లు తిరుగుతూ ప్రయాణం సాగిస్తోంది. కనిపించే త్రోవకూడ కానరావటంలేదు. మెరుపులు మెరుస్తున్నాయి. ఎటువైపో వాన కురుస్తోంది కాబోలు ఉరుములు భయంకరంగా గర్జిస్తున్నాయి. గాలికి తలుపులు చప్పుడుచేస్తూ ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నాయి. ప్రకాశరావుగారు లేచి కిటికీ తలుపులు మూసివచ్చారు. బైట హోరుమనే గాలి. కారుమబ్బులు శరవేగంతోపోయి కొండల్ని ఢీకొన్నాయి. సన్నగా ప్రారంభించిన చినుకులు మరుక్షణమే హోరున శబ్దంతో ఏనుగు తొండాలంత ధారలై పెద్ద పెద్ద మెరుపులతో విపరీతంగా వర్షం కురుస్తోంది. ఉరుములు ఉరుముతున్నాయి. పిడుగులు భయంకర శబ్దాలతో పడుతున్నాయి. విద్యుద్దీపాలు ఆరిపోయాయి. వీధులన్నీ చీకటిమయం. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఆ అరరాత్రి ప్రళయమే సంభవించనున్నదా? అన్నట్లుగా ప్రకృతి వికృతంగా వికటాట్టహాసం నలుదిక్కులా ప్రతిధ్వనింపజేస్తూ, విలయనాట్య మారంభించింది. చలిగాలి, హోరున వర్షం, ఆకాశం చిల్లులు పడిందా అన్నట్లు కురుస్తోంది వాన. వీధుల్లో అంతవరకు తిరిగిన జంతువులు ప్రకృతి విలయ న్యాటానికి భయపడి చిన్న చిన్న అరుగులపై చేరి, శరీరాన్నంతా ముడుచుకొని, వెచ్చగా మూలల్లో నిదురించ సాగాయి. ఒకటీ, రెండు, మూడు గంటలు దాటాయి. ప్రవేశించబోయేది నాల్గవ గంట. అంతవరకు అడ్డూ ఆపు లేకుండా కురిసిన వర్షం కాస్తంత తెరిపిచ్చింది. సన్నగా జల్లు కొట్టసాగింది. గాలిమాత్రం ఆ విసురులోనే వుంది. కాలువలు ఫుల్‌గా పారుతూ, గమ్యస్థానం చేరడానికి చర్చించుకుంటున్నాయి, తెల్లవారుజామున నాలుగ్గంటలయింది. కోళ్లు అంత వర్షంలోను తెల్లవారుతోందని కూస్తున్నాయి. ప్రకాశరావుగారింటిముందు ఒక కుక్క మాత్రం ఆపకుండా స్థాయి పెంచి ఏడుస్తోంది.

డాక్టరు రాజారావుగారు పూర్తిగా సోఫాలో నిద్రాదేవికి బానిసయి ఒరిగిపోయారు. ప్రకాశరావుగారి కంటిపై చిన్న కునుకుపడుతోంది. వెంటనే త్రుళ్ళిపడుతూ లేస్తున్నారు. రత్నమ్మగారుమాత్రం కళ్ళల్లో వత్తులు పెట్టుకున్నట్లు చూస్తూ దుఃఖిస్తు కూర్చున్నారు. రేగిన కురులు, నీరసంలోవున్న మోము, ఏడ్చినట్లు బుగ్గపై కన్నీటి చారలు, జ్యోతుల్లా మెరుస్తున్న కళ్లుగల నాగమణి మంచంపైనే ఉంది.

మెల్లగా కదిలింది శరీరం మంచంపై. ఆడగా చూశారు రత్నమ్మగారు. కళ్లు త్రిప్పింది మెల్లగా నాగమణి. చేతులెత్తి తల్లికి నమస్కరించింది. కళ్లు తేలవేసింది. నోరు విప్పలేకపోయింది, మాట రావడంలేదు.

రత్నమ్మగారు అది చూచి కంగారుగా 'ఏమండీ!' అంటూ కేక వేసింది భయంగా. చిన్న కునుకుపట్టిన ప్రకాశరావుగారు త్రుళ్ళిపడిలేచి 'ఏమేవ్' అన్నారు.

'అమ్మాయిని చూడండి! నాకు భయమేస్తోంది' అన్నారు. కుర్చీలోనుండి గభాలున లేచి మంచంవద్దకు వచ్చారు. నాగమణిని చూచారు.

అప్పటికే నాగమణి కళ్లు తేలవేసింది. మొహంలో వికృతంగా మార్పులు రాసాగాయి. కడుపులోనుండి ఏదో వుండలాంటిది పైకి నిముష నిముషానికి రాసాగింది.

(సశేషం)

